క్లుప్తంగా

టీబీపై అవగాహన ఉండాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కోనరావుపేట: క్షయవ్యాధిపై బాధితులతో పాటు వారి కుటుంబసభ్యులు అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వారితో మాట్లాడుతూ ఇంట్లో ఎవరైనా దగ్గు, దమ్ముతో బాధపడుతుంటే కుటుంబసభ్యులు సైతం మాస్కులు వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రషీద్, ల్యాబ్ టెక్నిషన్ జనార్దన్, జేత్య, నాగ రాజు, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై విచారణ



కొలతలు వేస్తున్న ఇరిగేషన్ అధికారులు

ముస్తాబాద్: పట్టణంలోని మానేరు ప్రాజెక్టు కెనాల్‌పై మట్టి తవ్వకాలపై విచారణ చేపట్టినట్లు డీఈఈ రవికుమార్ శనివారం తెలిపారు. ఇటీవల మానేరు కెనాల్‌పై పంచాయతీరాజ్ శాఖ ద్వారా సీసీరోడ్లు నిర్మించినట్లు తెలిపారు. 70 ఫీట్ల వరకు రైతులు అభ్యంతరం తెలపడంతో ఆ మేరకు సీసీ పనులు నిలిపిసినట్లు చెప్పారు. ఆ స్థలంలోని మట్టిని రెండుఫీట్ల వరకు తొలగించడంతో కెనాల్ ప్రమాదకరంగా మారిందన్నారు. కెనాల్ మట్టిని తవ్విన ఘటనపై విచారణ చేపడుతామన్నారు. నీటిపారుదలశాఖ అనుమతులు లేకుండా మట్టిని తీయడం సరికాదన్నారు. సీసీరోడ్లు నిర్మిస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కేటీఆర్ కోలుకోవాలని పూజలు



పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గంభీరావుపేట: జిమ్‌లో గాయపడ్డ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ త్వరగా కోలుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మండలకేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కరువారి శంకర్, పాపగారి శ్రీనివాస్‌గౌడ్, పిట్ల బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ వాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో ఎల్లమ్మ వాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నీటిపారుదలశాఖ ఎస్ఈ పెద్ది రమేశ్ క్షేత్రస్థాయిలో శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. పోతుగల్, ముస్తాబాద్ రైతుల కోసం, భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఎల్లమ వాగుపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చాయని ఈసందర్భంగా ఎస్ఈ తెలిపారు. ముస్తాబాద్ పెద్ద చెరువు నుంచి వచ్చే ఎల్లమ్మ వాగులో ఏమేరకు నీటి ప్రవాహం ఉందో తెలుసుకున్నామన్నారు. ఎన్ని ఎకరాలకు సాగునీరందు బాటులో ఉందో అంచనా వేశామన్నారు. దీని కోసం భూగర్భ గనులశాఖ జియోలజిస్టు రవీందర్ పరిశీలన జరిపారన్నారు. ఎస్ఈ వెంట ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈఈ రవికుమార్, ఏఈ వంశీకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

శిక్షణ ఎస్సైగా శ్రీనివాస్

ముస్తాబాద్: ముస్తాబాద్ ట్రెయినీ ఎస్సైగా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్సై శిక్షణలో భాగంగా శ్రీనివాస్ ట్రెనీ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తారని ఎస్సై గణేశ్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సంబంధాలపై శిక్షణ పొందుతారన్నారు.

చిప్పలపల్లిలో రక్షక దళం ఏర్పాటు

మండలంలోని చిప్పలపల్లిలో గ్రామ రక్షక దళాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. వేసవిలో దొంగతనాలు జరగకుండా నిరోధించేందుకు గ్రామ రక్షక దళాలు రాత్రివేళల్లో గస్తీ ఉంటాయన్నారు. గ్రామంలో అపరిచిత వ్యక్తుల సంచారం తెలిసిన వెంటనే సమాచారం అందించాలన్నారు. అలాగే దేవాలయాలలో చోరీలు జరగకుండా గస్తీ కాస్తాయన్నారు. రక్షక దళాలకు మాజీ సర్పంచ్ గాడిచర్ల దేవయ్య రెండు క్యారం బోర్డులను అందించారు.

అదుపుతప్పిన కారు



వేములవాడ: పట్టణంలోని మొదటి బైపాస్ రహదారి మహాలక్ష్మీవీధి ప్రాంతంలో శుక్రవారం కారు అదుపుతప్పింది. తెల్లవారుజామున కారు అతివేగంతో వచ్చి చెట్టును ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. కారులో ఉన్న ఒకరికి స్వల్పగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రైతులపై టార్పాలిన్ల భారం



అద్దెకు తెచ్చిన టార్పాలిన్లను ధాన్యం సంచులపై కప్పిన రైతులు

- సరఫరా కాని సబ్సిడీ టార్పాలిన్లు
- అద్దెతో అన్నదాతలకు అదనపు ఖర్చు
- ధాన్యం కాపాడుకునేందుకు రైతుల నానా తిప్పలు

గంభీరావుపేట: ఎండనక.. వాననక ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు, ఆరబెట్టేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. అకాలవర్షాలతో ధాన్యం తడుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 50శాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు టార్పాలిన్లు అందించేవారు. ఎనిమిది ఫీట్ల పొడవు, ఆరు ఫీట్ల వెడల్పు ఉన్న టార్పాలిన్ల అసలు ధర రూ. 2,500 కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై రూ. 1250కే రైతులకు అందజేసింది. రెండు, మూడేళ్లపాటు పథకాన్ని కొనసాగించి తర్వాత ప్రభుత్వం ఆపేసింది. అప్పట్లో రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. జిల్లాలో 1.78లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు అంచనా. ధాన్యం సేకరణకు అధికారులు జిల్లావ్యాప్తంగా 238 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 3.67లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తుందని అధికారుల అంచనా

అద్దెకు టార్పాలిన్లు..

అన్నదాతలకు అదనపు ఖర్చు

ప్రస్తుతం సబ్సిడీ టార్పాలిన్లు అందజేయడాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతో రైతులు నానా తిప్పలు పడుతున్నారు. అద్దె టార్పాలిన్లు తీసుకురావడంతో అన్నదాతలపై అదనపు భారం పడుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు టార్పాలిన్లను అద్దెకు ఇచ్చే దుకాణాలను గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో టార్పాలిన్‌కు రూ.15 వరకు అద్దె తసుకుంటున్నారు. సాధారణంగా ప్రతి రైతుకు కనీసం ఆరు నుంచి పది టార్పాలిన్ల వరకు అవసరం ఉంటాయి. దీంతో రోజుకు రూ. 250 వరకు అదనపు భారం పడుతోంది. పంట నూర్పిడి చేయడం, ఆరబెట్టడం, సంచుల్లో నింపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడానికి కనీసం 20 రోజుల సమయం పడుతోంది. ఈ లెక్కన రైతులపై టార్పాలిన్ల భారం దాదాపు రూ. 5వేల వరకు పడుతోంది. ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

సౌకర్యాలు కరువు

నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో రైతులకు సౌకర్యాలు కల్పించడం లేదు. కేంద్రాల్లో టార్పాలిన్లు లేవు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో నీడ, నీళ్లు, విద్యుత్ సౌకర్యాలు లేవు.

అదనపు భారం



ఏటా ధాన్యం అమ్ముకునే సమయంలో టార్పాలిన్ల అద్దె కోసం రూ.నాలుగైదు వేలు ఖర్చు అవుతున్నాయి. ఇప్పటికే అనేక సమస్యల్లో రైతులకు ఇది అదనపు భారంగా మారింది. గతంలో మాదిరిగా ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు రైతులకు అందించాలి.

– గంట శ్రీనివాస్, రైతు, గంభీరావుపేట

అకాలవర్షాలతో ఇబ్బంది



రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే అకాలవర్షాలు వెంటాడుతున్నాయి. ధాన్యంపై కప్పడానికి రైతులు టార్పాలిన్ల కోసం ప్రైవేటు దుకాణాల వైపు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం అద్దె టార్పాలిన్ల భారం నుంచి రైతులకు విముక్తి కల్పించాలి. సబ్సిడీపై రైతులకు అందించాలి లేదా కేంద్రాల్లో టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలి.

– రాజేందర్‌రెడ్డి, రైతు, గంభీరావుపేట

రైతుల సమస్యలు పరిష్కరించాలి



కోనరావుపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

కోనరావుపేట: కొనుగోలు కేంద్రాల్లో నెలరోజులుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కోనరావుపేట, నిమ్మపల్లి క్రాస్ రోడ్డు పై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు దాటుతున్నా ఇప్పటికీ ధాన్యం తూకం వేయడంలేదన్నారు. ఓవైపు అకాలవర్షాలకు పంటలు నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నా కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్లు మహేశ్, భూంరెడ్డి, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంతోష్, గంగాధర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పర్శరాములు, లక్ష్మణ్, ప్రభాకర్‌రెడ్డి, రాజయ్య, రమణారెడ్డి, జగన్ తదితరులున్నారు.

గ్రామ దేవతలకు పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి: మండలకేంద్రంలోని గ్రామ దేవతలు పోచమ్మ, శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి, దుర్గాదేవికి శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూము జలపతి, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, చిట్టి పాక మల్లయ్య, పల్లి గంగాధర్, గండి నారాయణ, ధర్నా మల్లేశం, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



బోయినపల్లి: క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



తంగళ్లపల్లిలో..

బోయినపల్లి: దేశవ్యాప్త కులగణనకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తంచేస్తూ మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపెల్లి పరశురాం ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఉదారి నర్సింహాచారి, మాజీ అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, మెరుపుల గంగాధర్, గంగిపెల్లి స్వామికుమార్, కొండం శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్ చారి, సారంపెల్లి రాజు, అనీల్, మోడీ, నిఖిల్, నవీన్, రజనికాంత్, సాయి. దూస శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలకేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్, మండల ఓబీసీ అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వినయ్ యాదవ్, మధుసూదన్, ఆశీర్వాద్, భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనాలు నడపొద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మారుతి

వేములవాడరూరల్: వాహనదారులు మద్యంతాగి వాహనాలు నడపవద్దని వేములవాడ రూరల్ ఎస్సై మారుతి అన్నారు. ఫాజుల్‌నగర్ వద్ద శుక్రవారం రాత్రి ఆయన వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. హెల్మెట్ ధరించాలని సూచించారు. సరైనపత్రాలు లేనివారికి జరిమానా విధించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న నారాయణ

గంభీరావుపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ముందుకెళ్లాలని అకాడమిక్ కౌన్సిలర్ నారాయణ అన్నారు. మండలంలోని దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పదో తరగతి తర్వాత ఉండే ఉన్నత కోర్సుల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు కొమురయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

చందుర్తి: మద్యంతాగి వాహనాలు నడిపిన ఆరుగురికి వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయ స్థానం మేజిస్ట్రేట్ ప్రవీణ్ జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు చందుర్తి ఎస్సై అంజయ్య తెలిపారు. వాహనాల తనిఖీలో పోలీసులకు పట్టుబడిన ముగ్గురికి రెండురోజుల చొప్పున, ఇద్దరికి మూడు రోజుల చొప్పున, ఒకరికి నాలుగు రోజులు జైలు విధించినట్లు ఎస్సై అంజయ్య పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

● సద్వినియోగం చేసుకోవాలి

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో శనివారం ఉదయం 7 నుంచి నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ జస్టిస్ మూమెంట్, అపోలో డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ చెకప్ నిర్వహిస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు మోహమ్మద్ హమీద్ అన్నారు. వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● చెవిలో పూలతో స్వర్ణకారుల నిరసన

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో కార్పొరేట్ జ్యువెలరీ దుకాణానికి అనుమతులు ఇవ్వవద్దంటూ స్వర్ణకారులు చేపట్టిన దీక్షలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వర్ణకారులు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. స్వర్ణకారుల కుల వృత్తిని రక్షించాలని కొరారు. స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య, బ్రహ్మం, శ్రీనివాస్, రాజు, సత్యనారాయణ, భాస్కర్, సంతోష్, అమర్,రమణ, అనిల్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్

చందుర్తి: స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మాజీ ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. శుక్రవారం చందుర్తిలో విలేకరులతో మాట్లాడారు. సర్పంచులు పదవికాలం ముగిసి 14 నెలలు గడుస్తున్నా, ప్రత్యేకాధికారులతో కాలంవెల్లదీస్తుందన్నారు. ప్రత్యేక పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎద్దేవా చేశారు. గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని ఆమె డిమాండ్ చేశారు.

● ద్విచక్రవాహనం చోరీ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన తలారి అశోక్ బైక్‌ను తెలియని వ్యక్తి ఎత్తుకెళ్లాడు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపి ఉంచిన బైక్‌ను ఎత్తుకెళ్లారని అశోక్ పోలీసులకు తెలిపాడు.

● అకాల వర్షం..తడిసిన ధాన్యం

ముస్తాబాద్: మండలంలో అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. ముస్తాబాద్, నామాపూర్, మొర్రాయిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. బందనకల్‌లో పాక్షికంగా వడగళ్లు పడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

● సన్మానం

వేములవాడ: రాజన్న ఆలయంలో పంప్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించి గతనెల 30తో ఉద్యోగ విరమణ పొందిన కూరగాయల శంకర్ దంపతులను ఆలయ ఉద్యోగుల సంఘం స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో ఘనంగా సన్మానించారు. ఆలయ ఉద్యోగ యూనియన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి



ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లి విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



బోయినపల్లి: విద్యార్థులను సన్మానిస్తున్న హెడ్‌మాస్టర్, గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. మండలంలోని బండలింగంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదిలో ఉత్తమ మార్కులు సాధించిన మనీషా, హలీమా, రోజా, సుగ్రను కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభజ్ఞులైన ఉపాధ్యాయులున్నారన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. రాజన్నపేట, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో ఇంటర్, పదో తరగతిలో జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులను బాలమిత్ర పౌండేషన్, మాజీ సర్పంచ్ ముక్క శంకర్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రాగుల ఎల్లారెడ్డి, గుండారపు వేణురెడ్డి, రాజు, సతీశ్, నిమ్మ మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు పదో తరగతిలో ఎం.అక్షయ, కె.ప్రణయ్, బి.శ్రీవిద్య, టి.సిరి, హర్షవీణ, గౌతమి ఉత్తమ మార్కులు సాధించగా కలెక్టర్ చాంబర్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ ఎం.విఠల్, ఉపాధ్యాయులు ఆర్.రమేశ్, మొహమ్మద్ హనీఫ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చందుర్తి : పది ఫలితాల్లో 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన మూడపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సోమినేని వైశాలిని మాజీ సర్పంచ్ చిలుక అంజిబాబు ఆధ్వర్యంలో సన్మానించారు. మూడపల్లి పాఠశాలలో 524 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన మర్రిపల్లి నవ్య, 500 మార్కులు సాధించిన నక్క సాత్విక్, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 467 మార్కులు సాధించిన ఇల్లంతకుంట మణిచంద్రను, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశంను సన్మానించారు. మాల మహానాడు జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నీరటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: విలాసాగర్ హైస్కూల్ విద్యార్థులను పాఠశాల ఆవరణలో గ్రామస్తులు ఉపాధ్యాయులు, సన్మానించారు. పదిలో ఉత్తమ మార్కులు సాధించిన గంగాధర శివాని, గంగాధర కావ్య, పొన్నం కీర్తన, గొట్ల శివాని, ముదిగంటి అక్షిత, అమ్మిగల్ల రచన, చిలువేరి వైష్ణవి, ధూమాల మయూరిను సన్మానించి మెమెంటోలు అందించారు. హెడ్‌మాస్టర్ బొలగం శ్రీనివాస్, కార్యదర్శి మిడిదొడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, వెంటకహనుమాన్, మదుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. హారిక, గణేశ్, శరణ్య, వర్ష, బాలిగారి వైష్ణవి, గీస వైష్ణవి, వర్షిని, చరణ్, శివసాయిను సన్మానించారు. హెచ్ఎం రాధాకిషన్‌రావు, యువ నాయకులు తోట ధర్మేందర్, కావటి మహిపాల్, జంగ రాజు, రాజశేఖర్, వెంకటేశ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు భూపతి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకకు అనుమతులు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: మండలం పొడవునా మానేరు నది ఉన్నా మండలవాసులు గృహ నిర్మాణాలకు ఇసుకకు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఇసుక అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజన్న మాట్లాడుతూ తంగళ్లపల్లిలో ఇసుక రీచ్‌లను మూసివేసి సిరిసిల్ల సాయినగర్ నుంచి అడపాదడపా ఇసుకుకు అనుమతులు ఇస్తున్నారన్నారు. కలెక్టర్ స్పందించి స్థానికంగా ఇసుక అనుమతులు ఇవ్వాలని, ఇసుక డీడీ గతంలో మాదిరిగా రూ.150 చేయలన్నారు. సిరిసిల్ల సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ వెంకటరమణా రెడ్డి, మాజీ ఎంపీపీ పడిగెల మానస, నాయకులు మాట్ల మధు, వలకొండ వేణు గోపాలరావు, పబ్బతి విజేందర్ రెడ్డి, జగత్, ప్రేమ్ కుమార్, అఫ్రోజ్, అనిల్ తదితరులున్నారు.

రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు



వేములవాడ : దరఖాస్తుల పరిశీలిస్తున్న అధికారులు

కోనరావుపేట: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేస్తున్న యువతీ యువకులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూ. 2 లక్షలలోపు రుణం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను జెడ్పీ సీఈవో గీత ఇంటర్వ్యూలు నిర్వహించారు. శుక్రవారం 360 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ మేనేజర్లు దిలీప్‌కుమార్, సంజీవ్, ఏపీఎం రాకేశ్ పాల్గొన్నారు.

వేములవాడ : వేములవాడ మున్సిపల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో బ్యాంక్ అధికారులు పరిశీలించారు. 6వ వార్డు నుంచి 10వ వార్డు వరకు దరఖాస్తులను వార్డు అధికారులతో కలిసి పరిశీలించారు. 250 దరఖాస్తులను పరిశీలించినట్లు కమిషనర్ అన్వేష్ తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

ముస్తాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువవికాసం అభ్యర్థులకు చివరి అవకాశంగా శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఇంటర్వ్యూలకు హాజరుకాని వారి కోసం మాత్రమే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



వీర్నపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసున్న కాంగ్రెస్ నాయకులు

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఏఎంసీ చైర్మన్ రాములు, ఏఎంసీ వైస్ చైర్మన్ లెక్కల లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, చంద్రమౌళి, తిరుపతి, పాల్గొన్నారు.

కోనరావుపేట: కులగణన, జన గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ, మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి, బీసీ మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బైరగోని నందూ, కర్రోళ్ల భాస్కర్, గొట్టె రుక్మిణి, చేపూరి గంగాధర్, గోపాల్, భాస్కర్‌రావు, ఏఎంసీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎల్లారెడ్డిపేట: దుమాలలో గొల్ల, కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బట్టు రాజు, ఉపాధ్యక్షులుగా దాయి బీరయ్య, ప్రధాన కార్యదర్శిగా కర్రోళ్ల ఆంజనేయులు, కోశాధికారిగా కర్రోళ్ల రాజు, రైటర్‌గా బట్టు బాలమల్లు, సలహాదారులుగా దాయి ఎల్లంలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను గ్రామస్తులు అభినందించి సన్మానించారు.

ఎంపీడీవోకు తప్పిన ప్రమాదం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణకు ప్రమాదం తప్పింది. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని జగిత్యాలకు వెళ్తున్న ఎంపీడీవో కారు వేములవాడ మండలం శాత్రాజుపల్లి వద్ద అతివేగంతో బైక్ కారును ఢీకొట్టింది. కారు ముందుభాగం దెబ్బతింది. రోడ్డు ప్రమాదంపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసిన ఎంపీడీవో వేరే వాహనంలో జగిత్యాలకు వెళ్లారు.